భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు



పూజల్లో మెట్రోజోన్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్

అబిడ్స్: విద్యుత్ సెంట్రల్ సర్కిల్ కార్యాలయంలో దీపావళి పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం చంద్ర విహార్ భవనంలో గల విద్యుత్ సెంట్రల్ సర్కిల్ కార్యాలయంలో దీపావళిని పురస్కరించుకుని లక్ష్మీదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మెట్రోజో చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, సెంట్రల్ సర్కిల్ ఎస్ఈ వెంకన్న, ఎస్ఏఓ సమ్మయ్య, డీఈఎంఆర్‌టీ సమ్మయ్య, అకౌంట్స్ ఆఫీసర్ శ్రీకాంత్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నంద, అసిస్టెంట్ ఇంజినీర్ (టెక్నికల్) సంపత్‌రెడ్డి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు నిరంజన్, వెంకట్రాం, శ్రీధర్, ప్రసూన, విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

అంజయ్యకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా తదితరులు

అబిడ్స్: దివంగత మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య వర్ధంతిని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనీలాల్‌షా, ఉపాధ్యక్షులు కుమార్‌రావు, శ్రీనివాస్‌రావు, డాక్టర్ బాలమణి శంకర్ రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మనీలాల్‌షా మాట్లాడుతూ..ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి అంజయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి'



గోల్కొండ: కలిసికట్టుగా పని చేసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ తెలంగాణ పరిశీలకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ ఆమెను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా షేక్‌పేట్‌లో కాంగ్రెస్‌కు ఉన్న ప్రజాదరణను ఆమెకు వివరించారు. మైనార్టీలతో పాటు బీసీలు, దళితులు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. షేక్‌పేట్ డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చేలా కలిసికట్టుగా పని చేస్తామని వివరించారు.

ఘనంగా సాహితీ జిగీష తృతీయ వార్షికోత్సవం



కేవీ రమణాచారి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: సాహితీ జిగీష తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి మాసబ్‌ట్యాంక్‌లోని గాయత్రీ సదనంలో ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి హాజరై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పరమాత్ముని మీద భక్తిని కలిగి ఉండాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన తెలుగు వర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీ శంకర్ మాట్లాడుతూ..గురు ప్రాధాన్యతను వివరించారు. ఆత్మీయ అతిథిగా హాజరైన ఆచార్య ఫణీంద్ర మాట్లాడుతూ..గురు శిష్య పరంపరను ప్రశంసించారు. అనంతరం కేవీ రమణాచారి దంపతులను, శివచంద్ర దంపతులను, సాయిరెడ్డి దంపతులకు ఆత్మీయ సత్కారం చేశారు. రఘుశ్రీ వందన సమర్పణ చేశారు.

22 నుంచి జాంసింగ్ ఆలయంలో కార్తీక పూజలు



అబిడ్స్: గుడిమల్కాపూర్ జాంసింగ్ వేంకటేశ్వర శివాలయంలో ఈ నెల 22 నుంచి కార్తీక మాసం పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శివాలయంలో ప్రతిరోజూ రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, అర్చనలు అభిషేకాలు, వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించనున్నారు. ఈ పూజలు 22 నుంచి నవంబర్ 21వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ అధికారులు వెల్లడించారు. నవంబర్ 5న కార్తీక పౌర్ణమి వేడుకలు పెద్ద ఎత్తున చేపడతామన్నారు. అదేరోజు జ్వాలాతోరణం, రుద్రాభిషేకాలు, అర్చనలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, దీపాలంకరణలు ఇతర ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



సంతోష్‌నగర్ చౌరస్తాలో బీజేపీ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్ యాదవ్ తదితరులు

రాష్ట్ర బంద్ విజయవంతం

డిపోలకే పరిమితమైన బస్సులు

- ధర్నాలు, రాస్తారోకోలతో స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ శనివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర బంద్ విజయవంతమైంది. చార్మినార్, అబిడ్స్, మెహదీపట్నం జోన్ల పరిధిలో వివిధ పార్టీల నాయకులు ఉదయం నుంచే రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. బస్సు డిపోల్లో నుంచి బస్సులు రాకుండా కట్టడి చేశారు. దుకాణాలు, విద్యాసంస్థలను మూసివేయించారు. బస్సులు లేకపోవడంతో వివిధ ప్రాంతాల వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆయా బస్సు డిపోల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహదీపట్నం జోన్ల బృందం



జియాగూడ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లేను అరెస్ట్ చేసి తీసుకువెళ్తున్న పోలీసులు



మిధాని డిపోకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు



జియాగూడలో..బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిషోర్‌కుమార్



కార్వాన్ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



ఉప్పుగూడలో ధర్నాలో బీఆర్ఎస్ నేత ఆకుల శ్రీనివాస్ తదితరులు

తెలంగాణ సకల కళల సమ్మేళనం



కళాకారులతో ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం సకల కళల సమ్మేళనమని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీల సంయుక్తాధ్వర్యంలో అఖిల భారత స్థాయి డ్యాన్స్, మ్యూజిక్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం సమాజంలో శాస్త్రీయ సంగీత కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోగా పలువురు నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీనటి కరాటే కల్యాణి, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సునిత, నృత్య గురువు డాక్టర్ ఎం.ఏకవీర, సంస్థ వ్యవస్థాపకులు వీరేష్ యాదవ్, సిరి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా చెత్త తొలగింపు పనులు



ఎర్రకుంట హిందూ శ్మశాన వాటికలో పనులను పరిశీలిస్తున్న ఏఈ శిరీష

చార్మినార్: దీపావళి సందర్భంగా పాతబస్తీలోని హిందూ శ్మశాన వాటికలను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శుభ్రం చేయిస్తున్నారు. పండగను పురస్కరించుకొని కొంత మంది తమ పూర్వీకుల సమాదుల వద్దకు వెళ్లి శ్రద్ధాంజలి ఘటించి దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని శ్మశాన వాటికల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేస్తున్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-7 ఏఈ శిరీష యాకుత్‌పురా నియోజకవర్గం పరిధిలోని ఎర్రగుంట హిందూ శ్మశాన వాటికను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ నెల 20వ తేదీ లోపు పనులను పూర్తి చేయిస్తామన్నారు.

పాతబస్తీలో సందడే..సందడి

చార్మినార్: దీపావళిని పురస్కరించుకుని విద్యా సంస్థలకు సెలవులు రావడంతో శనివారం కుటుంబసభ్యులతో కలిసి పాతబస్తీకి తరలివస్తున్న సందర్శకులతో చార్మినార్ పరిసరాలు రద్దీగా మారాయి. ధంతేరస్ కూడా కావడంతో బంగారం వ్యాపార సంస్థలన్నీ కళకళలాడుతున్నాయి., బంగారం, వెండి ధరలు ఆకాశాన్ని అంటినప్పటికీ..ధంతేరస్ సందర్భంగా ఎంతో కొంత బంగారం కొనాలని నమ్మే వారందరూ క్యూ కట్టారు. ఒకవైపు సందర్శకుల సందడి..మరోవైపు ధంతేరస్ కావడంతో పాతబస్తీలో సందడి పెరిగింది. నడకకు కూడా దారి దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో రద్దీగా మారాయి.

కనిపించని ఫుట్‌పాత్‌లు...

పాతబస్తీలో ఎక్కడా చూసినా ఫుట్‌పాత్‌లు కనిపించడం లేదు. పాతబస్తీలోని ప్రధాన రోడ్డు అయిన గుల్జార్‌హౌజ్ నుంచి నయాపూల్ వరకు ఇంకా ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి రావడం లేదు. ఈ రోడ్డులో రద్దీ సమయంలో కేవలం ఒక కిలోమీటర్ దూరానికి అర గంట సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చే స్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణాలు (షో రూం)ల ముందున్న ఫుట్‌పాత్‌లు తమ సొంతమన్నట్లు ఆయా షో రూంల యజమానులు వ్యవహరిస్తున్నారు.

నడిరోడ్డుపై వ్యాపారాలు..

ఫుట్‌పాతులే కాదు..రోడ్లు సైతం ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వమూ రోడ్లపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించడమే కాకుండా నడిరోడ్డుపై చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. దీంతో పాదచారులు నడిరోడ్డుపై నడిచి వెళుతుండడంతో ఎప్పుడు ఏ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీ కొడుతుందోననే భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ ముందుకెళుతున్నారు.



గుల్జార్‌హౌజ్-చార్మినార్ రోడ్డులో సందర్శకుల సందడి

నేడు హెరిటేజ్ వాక్

శాలిబండ: వారసత్వ కట్టడాల విశిష్టతను పర్యాటకులకు తెలిపేందుకు ఈ నెల 19న రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు హెరిటేజ్ వాక్ చార్మినార్ కట్టడం నుంచి ప్రారంభమై బాద్‌షాహీ ఆషూర్‌ఖానా వరకు కొనసాగుతుందన్నారు. ఈ వాక్‌లో దేశ వ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ శిక్షణార్థి అధికారులు దాదాపు 200 మంది పాల్గొంటారన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వెంకటేశ్వర్ రెడ్డి

యాకుత్‌పురా: దీపావళిని పురస్కరించుకొన్ని ప్రజలు ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఓ) జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పని సరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 80 దరఖాస్తులు రాగా అందులో 6 తిరస్కరించామన్నారు. స్టేషన్ పరిధిలోని లాల్‌దర్వాజా వేంకటేశ్వర స్వామి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయం, ఛత్రినాక తవ్వల బావి ప్లే గ్రౌండ్, గౌలిపురా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటు చేయనున్నారన్నారు.

ఘనంగా ధన్‌తేరస్ వేడుకలు



బంగారు ఆభరణాలు ఖరీదు చేస్తున్న వినియోగదారులు

చార్మినార్: దీపావళికి ముందే వచ్చే ధన్‌తేరస్‌ను ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజలను పురస్కరించుకొని బంగారు ఆభరణాల దుకాణాల యజమానులు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో షోరూంలన్నీ కళకళలాడాయి. ధన్‌తేరస్‌కు తప్పనిసరిగా బంగారాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే ఆచారంతో మహిళలు కుటుంబసభ్యులతో కలిసి బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి ఇష్టపడ్డారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటినా వినియోగదారులు మాత్రం వెనుకడుగు వేయకుండా బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి ఉత్సాహం చూపించారని డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి అనే వ్యాపారి తెలిపారు.

దీపావళికి దర్బార్ మైసమ్మ ఆలయం ముస్తాబు



దర్బార్ మైసమ్మ ఆలయం

గోల్కొండ: దీపావళికి కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయం ముస్తాబయ్యింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారి దర్శనం కోసం బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. దశాబ్దాల చరిత్ర గల దర్బార్ మైసమ్మ ఆలయంలో దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పూజలకు కార్వాన్ నియోజకవర్గం నుంచే కాకుండా నాంపల్లి, గోషామహల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఆలయంలో దీపావళి పూజలు నేటి నుంచి ప్రారంభం అవుతాయి. కాగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేస్తున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా పూజలు ప్రశాంతంగా జరిగేందుకు ఆలయానికి వచ్చే అన్ని ప్రధాన రహదారులపై బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం..



దీపావళి పురస్కరించుకొని భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. మహిళలు, పిల్లలకు విడివిడిగా బారికేడ్లు వేశాం. ఆలయానికి వచ్చే అన్ని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్‌లు కాకుండా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

– అమర్‌సింగ్, ఆలయ కమిటీ చైర్మన్

'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం'



షేక్‌పేట్‌లో ప్రచారం చేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాభవం తప్పదని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన షేక్‌పేట్ డివిజన్‌లోని వినోభానగర్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ దివాళా అంచున ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం భారీగా రాష్ట్రానికి నిధులు ఇస్తున్నా అభివృద్ధి పనులు ఎక్కడ జరుగుతున్నాయో తెలియదన్నారు. దమ్ముంటే ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకోవాలని ఆయన ఛాలెంజ్ చేశారు. బీజేపీ అభ్యర్థి లంకల ప్రదీప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.అంజన్‌కుమార్‌గౌడ్, మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, సిద్ధప్ప, బీరప్ప తదితరులున్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న నర్సింగ్ సిబ్బంది, యూనియన్ నాయకులు

సుల్తాన్‌బజార్: కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శనివారం కోఠి డీఎంహెచ్‌ఎస్‌లో ధర్నా నిర్వహించి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఎండీ యూసుఫ్ ఎం.నర్సింహాలు మాట్లాడుతూ..టిమ్స్ ఆసుపత్రి ద్వారా కరోనా సమయంలో నియమితులైన కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బందిని 2022 సంవత్సరం నుంచి డీఎంఈ పరిధిలోని వివిధ ఆసుపత్రుల్లో విధులు నిర్వహించుకుంటున్నారని, వారికి గత 7 నెలలుగా జీతాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై డీఎంఈ అధికారులకు పలుమార్లు వినతిపత్రం సమర్పిస్తున్నా పెడచెవిన పెడుతున్నారని అందుకు నిరసనగా ధర్నాకు దిగామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిషన్, రజిత, లావణ్య, సుప్రియ, రత్న, సుజాత, స్వాతి, జయలక్ష్మి, స్వప్న, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

'సంగీతం మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది'



సినీ నేపథ్య గాయని మాలవికకు పురస్కారాన్ని అందజేస్తున్న దృశ్యం

గన్‌ఫౌండ్రీ: సంగీతం మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన శాఖ డైరెక్టర్ డి.చక్రపాణి అన్నారు. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనంద భైరవి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు మాలవిక, సాందీప్‌కు ఉత్తమ సినీ నేపథ్య గాయకుల అవార్డు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి ఆనంద భైరవి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంగీతం వినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. అంతకు ముందు పలువురు గాయనీ గాయకులు నాటి నుంచి నేటి వరకు పాత మధుర గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ విశ్రాంత డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, కర్ణాటక సంగీత విద్వాంసులు కేవి.బ్రహ్మానందం, సంస్థ వ్యవస్థాపకురాలు శారద సాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను పంపిణీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీను, వెంకటేశ్

గౌలిపురా: ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నప్పుడే నిజమైన ఆనందం లభిస్తుందని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ సి.శ్రీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ అన్నారు. దీపావళి సందర్భంగా లాల్‌దర్వాజా నాగులచింతలోని మదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సంస్థ కార్యాలయంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిరుపేదలకు ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకేనపల్లి మల్లికార్జున రావు, ప్రధాన కార్యదర్శి ఎ.రాఘవ, ఎ.సాయి తదితరులు పాల్గొన్నారు.

'జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం'

గోల్కొండ: జూబ్లీహిల్స్‌లో తన గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. శనివారం వివిధ పార్టీల నుంచి వచ్చిన వారు ఆయనను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు దశాబ్దాలుగా తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. మహ్మద్ ముస్తఫా, ఉమర్ తదితరులున్నారు.



నవీన్‌యాదవ్‌తో మహ్మద్ ముస్తాఫా తదితరులు

జ్యువెలరీ షాప్‌లో చోరీకి యత్నం..ఇద్దరి రిమాండ్

డబీర్‌పురా: జ్యువెలరీ షాప్‌లో దొంగతనానికి ప్లాన్ వేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంచల్‌గూడలోని ముజ్జబా జ్యువెలరీ దుకాణాన్ని లక్ష్యంగా చేసుకొని దొంగతనం చేసేందుకు సివిల్ ఇంజినీర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (46), చాంద్రాయణగుట్ట కేశవగిరికి చెందిన సయ్యద్ కబీర్ (34)తో పాటు మరో మైనర్ బాలుడితో ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా దొంగతనానికి కావాల్సిన వాల్ కట్టర్ మిషన్, పెద్ద, చిన్న హ్యామర్, డ్రిల్ మిషన్, హెల్మెట్, వైర్ కట్టర్, టార్చ్ లైట్‌లను జుమ్మెరాత్‌బజార్‌లో కొనుగోలు చేశారు. మత్తు పదార్థాలు హఫీజ్‌బాబానగర్‌లోని మెడికల్ షాపులో కొనుగోలు చేశారు. ప్లాన్‌లో భాగంగా ఈ నెల 10న చంచల్‌గూడలోని మారుఫ్ ట్రావెల్స్ దుకాణంలోకి వెళ్లిన వీరు ముగ్గురు తాము ఖురాన్ పఠనాన్ని పూర్తి చేసిన సందర్భంగా కూల్‌డ్రింక్‌ను పంపిణీ చేస్తున్నామని తెలిపి యజమాని ఖాజా సోహెబుద్దీన్ ఖాన్‌కు ఇచ్చేందుకు ప్రయత్నించగా నిరాకరించాడు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రాంతాల్లో పలువురికి ఈ మత్తు పదార్థాలు కలిపి కూల్‌డ్రింక్‌ను పంపిణీ చేశారు. దీంతో వారు గాఢ నిద్రలోకి జారుకున్నారు. అనంతరం చంచల్‌గూడలోని ముజ్జబా జ్యువెలరీ దుకాణంలో వారికి అందజేసి వారు మత్తులోకి జారుకున్న అనంతరం దొంగతనం చేసేందుకు ప్రయత్నించి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దొంగతనానికి విఫలమయ్యారు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శనివారం సయ్యద్ అహ్మద్ ఖాన్, సయ్యద్ కబీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా..మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

మరో మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలింపు